
హరిత కథ - 2009 పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# స్వయంకృతం

ఒకటే ఉమ్మదం. తిరిగిన ఫ్యాను తిరిగినట్టే వుంది. వళ్లంతా దిగచెమటలు. రాత్రి పదయ్యాక స్నానం చేసి మంచం మీద నడుంవాల్చాక కాసేపలా కునుకు పట్టిందో లేదో వాత్సవకు మెలకువ వచ్చింది. కావు కొట్లో పండబెట్టినట్లుంది దేహం.



గాల్లో తేమన్నది లేదు. ఉడుకెత్తి పోతున్నది. గొంతు తడారిపోతూ ఒకటే దాహం. చల్లటి ఫ్రిజ్ నీళ్లు మాటిమాటికీ గ్లాసుల కొద్దీ తాగినా దాహార్తి తీరటం లేదు. సరైన వెంటిలేషన్ లేక గది మరింత వేడెక్కి వళ్లు జిడ్డుతో కసపిసలాడుతూ చిరాకెత్తిపోతున్నది. ప్రాణానికి ఏ మాత్రం సుఖం లేదు.

అదే గదిలో మంచం మీద పడుకున్న భార్య, పిల్లలకేసి చూశాడు వాత్సవ. నిద్రకూ, మెలకువకూ మధ్య కొట్టుకులాడుతూ సుప్తావస్థలో వున్నట్లున్నారు. రెండేళ్ల నుంచి అనుకొంటూనే వున్నాడు ఏ.సి. బిగిస్తే ఎండాకాలంలో కాస్త సుఖంగా నిద్రపోవచ్చని. పాతిక ముప్ఫైవేలు వెచ్చించే వెసులుబాటు లేకపోయింది. అప్పోసప్పో చేసి ఏ.సి పెట్టించొచ్చు. కానీ వేసవికాలం మొత్తం మీద ఏడెనిమిదివేలు అదనంగా కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తుందనే భయం తెగింపు నివ్వలేకపోయింది.

"ఒక్క మే నెలే గదండీ కాస్త ఇబ్బంది పడేది... ఆ కాస్త కష్టానికి ఓర్చుకుంటే అప్పులతో అగచాట్లు పడే బాధుండదు"... స్వప్న సర్దుబాటు ధోరణి.

నిజానికి ఒక్క మే నెలలోనేనా ఎండలకు ఇబ్బంది పడుతున్నది? ఈ పదేండ్లలో వాతావరణంలో ఎంత మార్పు? ఒకప్పుడు ఋతుపవనాలు జూన్ మొదట్లో రాష్ట్రంలో ప్రవేశించి, చిరుజల్లులతో భూమిని చల్లబరిచి సేద దీర్చేవి. రానురానూ జూన్ దాటి, జులైలో కొచ్చి, జూలై నెలా దాటి ఆగస్టులో సైతం వర్షాలు కురవని విపరీత వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ యేడాది ఋతుపవనాలు మరీ ప్రాణాలతో చెలగాటమాడాయి. పట్టిన మబ్బులు పట్టినట్లే కాసేపలా ఆశలు రేకెత్తిస్తూ విహరించటం, వాన చినుకు జారకుండా చివరకు దూది పింజల్లా తేలిపోవటం మామూలైంది.

చివరకు దేశమంతా కరువు పరిస్థితులు తలెత్తాయి. త్రాగునీరు, సాగునీరు కరవై ప్రజానీకం యావత్తూ అల్లాడిపోతోంది. సకాలంలో వానలు కురవకపోవటానికి గల కారణాల గురించి రకరకాల ఊహాగానాలు. అన్నింటా సారాంశం ఒక్కటే... భూవాతావరణం వేడెక్కటం. అడవుల్ని తెగనరకొద్దని, కాలుష్యాన్ని నివారించాలని, హరిత వనాలను పెంచాలని, ఓజోన్ పొరను సంరక్షించుకోవాలనీ ముందస్తు జాగ్రత్తలు ఎన్ని చెప్తేనేం?... శాస్త్రజ్ఞుల మాటలు పట్టించుకొన్నదెవరు? అప్రమత్తతతో తీసుకున్న చర్యలేవి? మేధా మథనాలు ప్రజల అవసరాలను ఎంతవరకు తీర్చగలవు? సమస్య మూలాల్లోకి వెళ్లనంతకాలం కంటితుడుపు చర్యలు ఎంతవరకు సత్ఫలితాలనిస్తాయి?

మరో నూటయాభై యేళ్లకు నైఋతి రుతుపవనాలు కనుమరుగవుతాయని శాస్త్రజ్ఞుల హెచ్చరిక. వర్షాభావ పరిస్థితుల్లో బ్రతకడమెలా? తాగునీరు, సాగునీరు కరువైతే ఈ మానవాళి మనుగడ ఏమవుతుంది? రెండు మూడు తరాలు గడిచాక ఈ భూమ్మీద మానవ జీవితం ఎంత దుర్భరం కాబోతున్నది? ఆలోచించే కొద్దీ వాత్సవకు భయంతో ఒళ్లు జలదరించింది.

దగ్గర్లోనే ఎక్కడో ఒక ఉరుము ఉరిమింది. పిడుగుపాటుకు అంతా ఉలికిపాటుకు గురయ్యారు. బయటి వాతావరణంలో హఠాత్తుగా మార్పొచ్చి జోరున గాలి మొదలైంది.

పిడుగు పాటుకు నిద్రాభంగమైన భార్య, పిల్లలూ కాసేపటూ ఇటూ కదిలి తిరిగి నిద్రపోయే ప్రయత్నం చేస్తున్నారు.

ఆసక్తి కొద్దీ వాత్సవ మంచంమీద నుండి కిందకు దిగాడు. కిటికీలో నుంచి బయటకు చూశాడు. ఆకాశంలో కారుమబ్బులు. కాస్త వర్షం గానీ పడితే ప్రాణానికి ఎంత హాయిగా వుంటుందీ... అనుకున్నదే తడవుగా చల్లగాలి మొదలైంది.

"వానల్లు కురవాలి వాన దేవుడా, వరిచేలు పండాలి వానదేవుడా!!" చిన్నతనంలో వానలో తడుస్తూ పాడుకున్న పాటలు గుర్తొచ్చేయి.

ఆ రోజుల్లో తమ కుటుంబం ఒక పల్లెటూరిలో వుండేది. తాతలనాటిది రెండెకరాల మెట్ట పొలం వుండేది. వ్యవసాయంతో పాటు తండ్రి ధాన్యం బేరం, రకరకాల చిల్లర వ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని గౌరవప్రదంగా నడుపుకొచ్చేవాడు.

చెరువు గట్టుకు చేరువగానే తమ ఇల్లుండేది. వంద ఎకరాల విస్తీర్ణంలో చెరువు విశాలంగా వుండేది. నాలుగు ప్రక్కలా చెరువు కట్టను ఆనుకుని వరసగా బొమ్మరిళ్లలా పూరిళ్లు, పెంకుటిళ్లు, అక్కడక్కడా భవంతులుండేవి. ఆ చెరువుని తమ పూర్వీకులు తవ్వించారని అంటూండేవారు. తమ ఇంటిపేరుని జోడించి కడియాల వారి చెరువని పిలవటం తమందరికీ ఎంతో గర్వకారణంగా వుండేది. అంతేగాక ఆ చెరువంటే మంచి ఇష్టం కూడా ఏర్పడింది.

వర్షాకాలంలో అదేపనిగా వర్షాలు కురిసినప్పుడు ఆ కోలాహలమే వేరు. ముఖ్యంగా పిల్లలకు పెద్ద పండుగలా వుండేది. చెరువు నిండి ఇంటి గుమ్మాలలోకి నీళ్లురావటం, ఆ నీటిలో పరుగులు పెట్టడం, పడటం, బట్టలు తడుపుకోవటం భలే సరదాగా వుండేది. ఆ నీళ్లలో తేలియాడే బుల్లిబుల్లి చేప పిల్లల్ని దోసిళ్లతో పట్టడం, తొట్లలో వేసి గంటల తరబడి చూస్తుండటం పెద్ద తమాషా. ఒక్కోసారి చెరువు భారీగా నిండి నీరు ఇండ్లలోకి చొరబడే ప్రమాదం వుందనిపిస్తే ఒకవైపు గండికొట్టి నీటిని పొలాల్లోకి వదిలేవాళ్లు.

అప్పుడు చూడాలి పిల్లల ఆటలు, కేరింతలు. గండి వెంట వేగంగా దూసుకెళ్తున్న నీటి వాలులో ఎగిరెగిరి ఒడ్డునపడుతున్న చేప పిల్లల్ని పట్టి సీసాల్లో వేయడం, అవి సీసాల్లో పైకీ క్రిందకూ తిరుగుతూంటే ఎంత ముద్దొచ్చేవని...? వానలు తగ్గుముఖం పట్టి, చెరువు నీరు తీసి, గండి పూడ్చేదాకా పిల్లలందరికీ ఆ చెరువు తోటే లోకంగా వుండేది.

ఆ చెరువు నలుదిక్కులా కరెంటు దీపాల వెలుగులో రాత్రిళ్లు పిల్లలు, కుర్రవాళ్లు మురాలుగా చేరి ఎవరికి తోచిన ఆటలు వాళ్లు ఆడుకునేవాళ్లు. పెద్దలు కూడా అక్కడ చేరి సలహాలివ్వడం, తర్ఫీదులివ్వటం, తగాదాలు పడుతుంటే సర్ది చెప్పటం, కొట్లాటలకు

దిగితే కర్రసేవం మందలించడం చేస్తుండే వాళ్ళు. వెన్నెల రాత్రిళ్ళ యువకులు సరదాగా పోటీలు పెట్టుకునే వాళ్ళు. చెరువు నీటిలో కొబ్బరికాయవేసి, భుజంలోతు నీటిలో దిగి, భుజంపైకి లేవకుండా కర్రతో ఒక్కదెబ్బకు కాయ పగలగొట్టగలగడం ఒక గొప్ప వీరోచిత క్రీడ. ఒక ప్రక్క కర్రసాము, మరో ప్రక్కన కోలాటాలు, చెక్కభజనలు ఇలా రకరకాల సాంప్రదాయ కళలకు చెరువు సాక్ష్యంగా నిలిచేది.

పట్టపగలైతే గోలీకాయలు, గోటీబిళ్లలు, బచ్చాలు, ఒంగుడు దూకుళ్ళు, చెరపట్టీలు... ఇలా ఎన్నెన్ని ఆటలనీ...

దీపావళి నాడు కుర్రకారంతా నూనెగుడ్డలు, గోగుకట్టెలు, పూలబుట్టలు వెలిగించి చెరువు చుట్టూ దివిటీలు తిప్పుతుంటే ఎంత శోభాయమానంగా వుండేది ఆ దృశ్యం? లోగిళ్ల ముంగిట వెలిగించిన నూనె ప్రమిదలు చూస్తుంటే ఆకాశం నుంచి నక్షత్రాలు నేలకు దిగినట్లుండేవి. చెరువు నలుదిక్కులా ఇళ్ల బయట నిలబడి పిల్లలు అగరొత్తులు, మతాబులు, చిచ్చుబుడ్లు వెలిగిస్తుంటే కాంతి తోరణాలు కట్టినట్టే వుండేది. పెద్దవాళ్ళు జల్లీలు గిల్లి నిప్పంటించి నీటి మీదకు విసిర్తే, రవ్వలు చిమ్ముతూ నీటిమీద అది చేసే విన్యాసాలు చూస్తూ పిల్లలంతా ఒకటే కేరింతలు కొట్టేవాళ్ళు. వినాయకచవితికి పూజలందుకున్న బుల్లి బుల్లి మట్టి వినాయకుళ్లను ఆకులలములతోపాటు చెరువులో నిమజ్జనం చేసేవాళ్ళు. తరతరాల తీపిజ్ఞాపకాలనెన్నింటినో ఆ చెరువు తన గర్భంలో పదిలంగా దాచి పెట్టింది.

చాలకాలం తర్వాత, రెండేళ్ల క్రితం బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లినప్పుడు కావాలని చెరువు చూడటానికి పోతే కడుపు చెరువైనంత పనైంది. ఎప్పుడూ నీటితో కళకళలాడుతూండే చెరువు మూడొంతులు పూడిపోయి, చెత్తా చెదరంతో, పసరు నీటితో దుర్గంధ భూయిష్టంగా వుంది.

చుట్టూ ఏపుగా పెరిగిన పచ్చికతోపాటు గన్నేరు, రేగి, జిల్లేడు, ఉమ్మెత్త ఇంకా రకరకాలైన పూలమొక్కలతో చెరువుగట్లు పచ్చదనంతో కనువిందు చేసేవి. అలాంటిది ప్లాస్టిక్ డైనింగ్ పేపరు చుట్టలు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేటులు, క్యారీ బ్యాగులు గుట్టలుపడి చెరువుగట్లు అసహ్యంగా కనిపిస్తున్నాయి. పల్లెల్లో సైతం పెళ్లిళ్లూ పేరంటాళ్లలో హంగులూ, ఆర్భాటాలూ ఎంతగా పెరిగిపోయాయో చెరువుగట్లమీద పేరుకు పోయిన చెత్తే నిదర్శనం. నాగరికత విష స్వరూపం పల్లెలకు ఎంతగా విస్తరించిందో అక్కడి దృశ్యాలు కళ్లకు కట్టిస్తున్నాయి.

రెండు నిమిషాలపాటు కూడా అక్కడ నిలబడలేకపోయాడు. కడుపులో వికారం పుట్టి వాంతి వస్తుందనిపించింది. నీరుబికిన కళ్లతో ముందుకు కదిలాడు.

"అన్నాయ్! రెండేళ్ల తర్వాత చూడు, ఈ చెరువూ వుండదు. నోరున్నవాళ్లు ఇప్పటికే చాల భాగం ఆక్రమించేశారు. మిగిలింది తలా కాస్త కబ్జా చెయ్యటానికి పోటీలు పడుతున్నారు". వాత్సవ ప్రక్కన నడుస్తూ చెప్తున్నాడు. ఆ ఊళ్లోనే స్థిరపడిన చుట్టపతను.

గాలి ఉధృతానికి కిటికీరెక్క దఢేల్న కొట్టు కోవడంతో వాత్సవ ఆలోచనలు చెదిరి పొయ్యాయి. మట్టి వాసన నాసికా పుటాలకు తాకటంతో వర్షంజల్లు మొదలైందని గ్రహించాడు. కిటికీ రెక్కలు బోల్టువేసి బిగించాడు.

బయట వర్షం జోరుగా కురవటం మొదలైంది. ఈ సీజన్‌లో ఇదే పెద్ద వర్షం అనుకున్నాడు. చల్లటి వాతావరణానికి ప్రాణం కుదుట పడుతున్నట్లనిపించింది. ఇక నిద్రపడుతుందన్న ఆశతో బెడ్‌మీదకు చేరి మేను వాల్చాడు.

గాలిహోరు తగ్గి వాన జోరు ఎక్కువైంది. కరెంట్ పోయింది. చల్లగాలి తగులుతూంటే ఫ్యాన్‌గాలి అవసరం మాత్రం ఏముంటుంది? నిమిషాల్లోనే వాత్సవ నిద్రలోకి జారిపోయాడు అలసటమీద.

"ఏమండీ! మిమ్మల్నేనండీ! కొంప మునిగి పోతూంటే అంత మొద్దు నిద్రేంటి? లేవండి!" స్వప్న కేకలకు మెలకువ వచ్చింది.

స్వప్న చేతిలో క్యాండిల్‌తో నిలబడుతుంది. ఆమె ముఖంలో భయాందోళనలు. గభాల్న లేచి మంచం దిగాడు వాత్సవ. క్రింద కాళ్లు పెట్టాడో లేదో షాక్ కొట్టినంత పనయింది. కాలి చీలమండలి దాటి నీరు. ఇల్లంతా నీళ్లు. బయట వర్షం కురుస్తూనే వుందింకా.

పరిస్థితి ఎలా వుందో గమనించటానికన్నట్లు తలుపు గడియతీశాడు. అంతే... ఒక్క సారిగా తలుపుల్ని నెట్టుకుంటూ నీటి ప్రవాహం ఉధృతంగా లోనికి ప్రవేశించింది.

ఆ తాకిడికి భార్యభర్తలిద్దరూ క్రిందామీదయ్యారు. భయంతో 'కెవ్వు'మని అరిచింది స్వప్న. అతి కష్టంమీద తమాయించుకొని నిలబడ గలిగారిద్దరూ. బట్టలు సగం తడిచి ముద్దయ్యాయి.

బయట అంతులేని గాఢాంధకారం. జనం కలకలం తెలుస్తూనే వుంది. మెరుపుల వెలుగులో నీరు సముద్రాన్ని తలపింపజేస్తున్నది.

ఏంచెయ్యాలో పాలుపోని పరిస్థితి... గతంలో ఎంత పెద్ద వానొచ్చినా, తుపాను వచ్చినా నీరు బయట కాలువలు కట్టటమేగాని ఇంట్లోకి జొరబడటం ఎప్పుడూ ఎరగరు. ఏమిటో విపరీతం? చూస్తుండగానే నిమిషాల్లో నీటిమట్టం అంతకంతకూ పెరిగి మోకాళ్లలోతుకు చేరింది.

ఈ గోలకు పిల్లలూ నిద్రలేచారు. ఇంట్లో పరిస్థితి చూసి భయంతో వణికిపోతున్నారు. బల్లుల్లా తల్లిదండ్రుల్ని కరుసుకుపోయి ఏడ్వటం మొదలెట్టారు. పిల్లలకు ధైర్యం చెప్తున్నారేగానీ పరిస్థితి అంతుబట్టక దంపతులిద్దరూ లోలోన బేజారెత్తిపోతున్నారు.

"అమ్మా! మా పుస్తకాలు, స్కూలు బ్యాగులు..." గొల్లుమన్నారు పిల్లలిద్దరూ, అల్మారాలో నీళ్లలో మునిగిపోతున్న పుస్తకాలు చూస్తూ.

"పోనీలేమ్మా! పుస్తకాలు మళ్లీ కొనుక్కోవచ్చు. ఇంత పెద్ద వానొస్తే మనమేం చెయ్యగలం?" స్వప్న ఓదారుస్తోంది పిల్లల్ని.

ఒక్క పుస్తకాలనేంటి? బియ్యం, వంట సరుకులు, మంచాలు, పరుపులు, టీ.వి., ఫ్రిజ్, టేప్ రికార్డర్... ఇలా అవీ ఇవీ అనేంటి? సర్వం నీట మునగటం చూస్తుంటే గుండె చెరువైపోయింది.

ఆస్తినష్టం సరే... అసలు ప్రాణాలు నిలుపుకునే దారేది భగవంతుడా? అనుకోవటానికి మరెంతోసేపు పట్టలేదు. మొలలోతు నీళ్లు వచ్చి చేరాయి. అంతటితో ఆగేలా లేదు. నిమిష నిమిషానికీ నీటిమట్టం పెరిగిపోసాగింది.

బొద్దింకలు, కాళ్లజెర్రులు, చుంచెలుకలూ మొదలైన పురుగూ పుట్రా ప్రాణభయంతో నీటిమీద పరుగులు పెడ్తూంటే చూస్తూ పిల్లలు అరిచి గోలపెడ్తున్నారు.

ఇంట్లో పెరుగుతున్న వరదనీరు. బయట తగ్గని వర్షం. ఎంతసేపిలా? ఇంత రాత్రివేళ సహాయపడే వాళ్లుమాత్రం ఎవరుంటారు? ఎవరికి వాళ్లు తెగించి ప్రాణాలు కాపాడుకోవాల్సిందే!

అంతలో బయటి నుండి ఎదురింటి వాళ్లకేకలు వినిపిస్తున్నాయి. "వాత్సవగారూ! త్వరగా బయటకు రండి. ఇంట్లో వుండటం ప్రమాదం" గొంతులు చించుకుని అరుస్తున్నారు. భార్య చేతిలో ఎత్తి పట్టుకున్న కొవ్వొత్తి ఏక్షణాన్నైనా ఆరిపోయేలా వుంది. భార్యా, పిల్లల్ని పొదివి పట్టుకొని నడిపిస్తూ బయటికి నడుస్తున్నాడు వాత్సవ. గుమ్మందాటి బయటికి అడుగుపెట్టారో లేదో స్వప్న చేతిలో వున్న కొవ్వొత్తి గాలికి ఆరిపోయింది.

కటిక చీకటి. ప్రాణాలుగ్గబట్టుకొని నిలబడి పోయారు. నడుం లోతు నీళ్లలో ఎటు కదలాలో తెలియని పరిస్థితి. పిల్లలయితే గొంతు లోతు నీళ్లలో నీటి ఉధృతికి నిలబడలేకపోతున్నారు. భయంతో తల్లిదండ్రుల్ని అతుక్కుపోయారు.

టార్చిలైట్ వెలుగు మీద పడింది. ఎదురింటి వాళ్లు మేడమీద నిలబడి టార్చిలైట్ ఫోకస్ చేస్తూ కేకలు పెడ్తున్నారు. వీధిలో ప్రవాహపు ఉధృతి తీవ్రంగా వుంది. ఆ ప్రవాహంలో చిక్కుకుంటే ఏమైపోతామోనన్న భయంతో అడుగు ముందుకు పెట్టలేకపోతున్నారు.

"వాత్సవగారూ! వీధి వైపుకు రాకండి. ఇంటి మీదకు వెళ్లండి". టార్చిలైట్ వెలుగులో మెట్లు చూపిస్తున్నారు.

బ్రతుకు జీవుడా అనుకుంటూ మెట్లమీదుగా మిద్దెపైకి చేరుకున్నారంతా! వర్షానికి తడవకుండా తలదాచుకొనే వీలు లేదు. నిలువునా తడిసి ముద్దలవుతున్నారు. తడిసిన ఒంటికి చలిగాలి తోడై గజగజ వణికిపోతున్నారంతా. పిల్లల అవస్థ వర్ణనాతీతం.

అర్ధగంట తర్వాత వర్షం తెరపిచ్చింది. అడపాదడపా జల్లులు పడినా, తెల్లారేసరికి మబ్బులు చెదిరిపోయి అసలేంజరగనట్టే ఆకాశం ప్రశాంతంగా కనిపిస్తోంది. అయితే జరగాల్సినంత నష్టం జరగనే జరిగింది.

సిటీలోని పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. పాతమిద్దెలు వర్షానికి నాని కుప్పకూలిపోయాయి. శిథిలాల కింద నలిగి నలుగురైదుగురు చనిపోయారు. చీకటిరాత్రి వరదనీటితో పాటు కొట్టుకుపోయి డ్రైనేజిలో పడి ఆరేడుగురు గల్లంతయ్యారు. ఆస్తినష్టం లెక్క తేలలేదు. ఉన్నవాళ్లు, లేనివాళ్లని లేకుండా అంతా సహాయం కోసం చేతులు చాస్తున్నారు.

రెండుమూడు గంటల వర్షానికి ఇంతటి దారుణ పరిణామాలు సంభవించటం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రభుత్వశాఖలు సహాయక చర్యలు చేపట్టాయి. వరదనీటిలో చిక్కుకున్న వాళ్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బీదా బిక్కీ జనానికి తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేశారు. పులిహోరప్యాకెట్లు, పెరుగన్నాలు, మంచినీళ్లు అందజేశారు. రాజకీయ నాయకుల పరామర్శలు, ప్రతిపక్షాల విమర్శలూ ఊపందుకున్నాయి.

ఆ సిటీలోనే మరో ప్రాంతంలో వుంటున్న వాత్సవ బంధువులు సమయానికొచ్చి ఆదుకున్నారు. వర్షానికి తడిసి, చలికి బిగిసిపోయి, జ్వరంతో స్పృహ లేకుండా పడిపోయిన పిల్లలిద్దర్నీ ఆసుపత్రికి తరలించారు.

రెండురోజుల పాటు పిల్లలు మూసినకన్ను మూసినట్లే వున్నారు. పిల్లాడు మెల్లగా కోలుకున్నాడు గాని, పిల్ల పరిస్థితే మెరుగుపళ్లేదు. అసలే అనారోగ్యపు పిల్ల, ఆస్మా. చల్లగాలి పడదు. వర్షానికి కాస్త తడిస్తేనే పడకేసే పిల్ల గంటల తరబడి వానలో నానుతూ, చల్లగాలి పాలబడితే కోలుకోగలదా?

నాలుగురోజులకు గానీ వర్షపు నీరు తగ్గలేదు. ఇళ్లల్లోకి అడుగుపెట్టిన వాళ్లంతా జరిగిన నష్టాన్ని కళ్లారా చూసుకుంటూ కన్నీరు మున్నీరయ్యారు. పొదుపుగా సంవత్సరాల తరబడి ఒకటొకటిగా సమకూర్చుకున్న సామానంతా రాత్రికి రాత్రి సర్వనాశనమైపోవటం భరించలేక పోయారు. ఆస్తినష్టాలు లెక్కలు గట్టేవాళ్లేగాని, నష్ట పరిహారమిచ్చి పుణ్యం కట్టుకునేవాళ్లెవరు?

వారం రోజులైనా పిల్ల పరిస్థితి మెరుగ్గా లేదు. ఆసుపత్రి బిల్లు వేలకువేలు అవుతూనే వుంది. అయినవాళ్లు వస్తూ పోతూ చేతనైన సాయం చేస్తున్నారు. ధైర్యం నూరిపోస్తూనే వున్నారు.

"పాప కండిషన్ వెరీ సీరియస్! న్యుమోనియాలోకి దించింది" ఎక్స్‌రే చూస్తూ నిర్ధారించాడు ఛెస్ట్ స్పెషలిస్ట్.

ఆ విషయం తెలిసి స్వప్న బావురుమంది. వాత్సవకు కాళ్లూ చేతులాడలేదు. జరిగిన ఆస్తి నష్టం కన్నా, ముందు నుంచీ భార్యాభర్తలిద్దరూ పిల్ల అనారోగ్యం గురించే ఆందోళన పడుతున్నారు. ఈ గండం గట్టెక్కించమని దేవుళ్లను మొక్కుకుంటూనే వున్నారు.

డాక్టరు ఇస్తున్న మందుల సహాయంతో ప్రాణాలకోసం పోరాడి పోరాడి అలసిపోయిన చిన్నారి చివరకు ఓటమితో కన్నుమూసింది. విధిదే పైచేయిగా మిగిలింది. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఆ దంపతుల్ని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

ముద్దు మురిపాలతో పదేళ్లపాటు, ఆ పిల్లను గాజుబొమ్మలా పదిలంగా పెంచుకున్నారు. దురదృష్టం కొద్దీ చేజారి భళ్లున బ్రద్దలై మట్టిలో మట్టిగా కలిసిపోయింది.

కలా? నిజమా? పదిరోజుల్లో ఎంతటి విషాదం? కొద్దిసేపు ఏకధాటిగా కురిసిన వర్షం అపారమైన ఆస్తినష్టాన్ని, ప్రాణనష్టాన్నీ కలిగించటం ఏమిటి? దేశంలో ఏ మారుమూల పల్లపు ప్రాంతమో, పల్లె ప్రాంతమో కాదు. అన్ని హంగులూ వున్న ఒక అధునాతనమైన సిటీ. కురవక కురవక కురిసే కొద్దిపాటి వర్షానికి మోదం చెందాల్సిందిపోయి ఖేదం మిగలటం ఏమిటి?

అధికార యంత్రాంగం సీరియస్‌గా సర్వేలు, సమీక్షలు చేసింది. సిటీ పల్లపు ప్రాంతాల్లో వరద బీభత్సానికి కారణం డ్రైనేజిలో పేరుకు పోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలేనంటూ తేల్చి చేతులు దులిపేసుకొంది. మరో సెన్సేషనల్ వార్త దొరికే వరకూ గతిలేనట్లు మీడియా అదేపనిగా ఆ వార్తను రెండ్రోజులు కథలు కథలుగా ప్రసారం చేసింది. మూడోరోజుకంతా సద్దుమణిగింది.

ఇంత జరిగినా వీధుల్లో కనిపిస్తున్న దృశ్యాల్లో ఏ మార్పూలేదు. ఏ పశ్చాత్తాపమూ లేదు. ఏ ఆత్మవిమర్శా లేదు. ముందు చూపు అంత కన్నా లేదు. హడావుడిగా పరుగులు పెడ్తున్న జనం చేతుల్లో యథావిధిగా ప్లాస్టిక్ సంచులు. కూరగాయలు, పళ్లు, ఫలహారాల పార్శిళ్లు... అక్కడ, ఇక్కడనేమిటి? ఎటుచూసినా కార్పొరేషన్ వాళ్ల డస్ట్‌బిన్నుల్లో అదే ప్లాస్టిక్ చెత్త గుట్టలు గుట్టలుగా! దుర్గంధాన్ని వెదజల్లుతూ! ఈ రోజు పబ్బం గడవాలంతే. రేపటి చావు సంగతి – రేపటిదే!

*(కథాకేళి, ఏప్రిల్ 2011)*